క్లుప్తంగా

'గిరిజనుల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు'

దేవరుప్పుల : గిరిజనుల అభ్యున్నతికి చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, జనగామ జిల్లాల అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బానోత్ రూపాదేవి సూచించారు. సోమవారం మండలంలోని ధర్మాపురంలో దర్తీ ఆభ భగీదారి అభియాన్ పథకంపై తహసీల్దార్ ఆడెపు అండాలు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యాన ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించడానికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ అభివృద్ధి అధికారి బి.రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలని తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

జనగామ: పట్టణంలో సోమవారం రాత్రి ఇస్కాన్, హరేకృష్ణ హరేరామ భక్త బృందం, గీతాశ్రమం ఆధ్వర్యాన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ఆర్టీసీ చౌరస్తా నుంచి కనుల పండువగా సాగింది. ధనుంజయ పండిత్ దాస్ ప్రభు యాత్ర ప్రారంభించారు. నెహ్రూపార్కు మీదుగా రైల్వేస్టేషన్ వరకు సాగిన యాత్రలో భక్తులతోపాటు బీజేపీ, వీహెచ్‌పీ, హిందూ వాహిని, బజరంగ్‌దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు. యాత్రకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సీఐ దామోదర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

జనగామ : జనగామ పురపాలిక పరిధిలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీలు, శానిటేషన్ నిర్వహణపై సాక్షిలో ప్రచురితమవుతున్న కథనాలకు ఎమ్మెల్యే స్పందించారు. అధికారుల అలసత్వంతో గాడి తప్పిన పాలన, సమస్యలపై ఎమ్మెల్యే.. కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా దృష్టికి తీసుకు వెళ్లారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.అదనపు కలెక్టర్ పనులు జరుగుతున్నాయా లేదా పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.


ఇసుక లారీలు ఢీ..

● ఒకరికి తీవ్ర గాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్ : ముందు వెళ్తున్న ఇసుక లారీని వెనకాల వస్తున్న మరో ఇసుకలారీ ఢీకొట్టడంతో నల్లగొండకు చెందిన గోగు శేఖర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి నుంచి ఇసుకలోడ్‌తో లారీ ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు వెళ్తోంది. కాగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న ట్యాంకర్ లారీని ఇసుక లారీ డ్రైవర్ వెంకటేష్ ఓవర్ టేక్ చేస్తుండగా వెనకాల వస్తున్న మరో ఇసుకలారీ ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ శేఖర్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా గమనించిన స్థానికులు, ఇతర డ్రైవర్లు లారీలో ఇరుక్కున్న శేఖర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అయితే గంట వ్యవధిలో జనగామ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ జరిగిన ప్రమాదాన్ని చూసేందుకు లారీని స్లో చేశాడు. అదే సమయంలో ఉప్పల్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు సదరు లారీని వెనకనుంచి ఢీకొట్టింది. ముసురు వర్షం కురుస్తుండటంతో బస్సు బ్రేక్‌లు సరిగ్గా పడక ప్రమాదం చోటుచేసుకుని బస్సు అద్దాలు పగిలాయి. ఎస్సై వినయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదపు తీరును పరిశీలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మల్లేష్ (ఫైల్)

జనగామ రూరల్ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని ఎర్రకుంట తండాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ మల్లేష్ (40) తన ఇంటికి విద్యుత్ రాకపోవడంతో సరిచేయడానికి ఇల్లు ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. కాగా విద్యుత్ షాక్‌తో ఇంటి నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అర్హులకే సంక్షేమ ఫలాలు

● కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్లు

జనగామ రూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం గ్రీవెన్స్ అనంతరం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయి లబ్ధిదారులకు నగదు జమయ్యేలా చూడాలని చెప్పారు. లబ్ధిదారులకు మాత్రమే ఇసుక ఉచితంగా అందేలా తహసీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. ఫీవర్ సర్వే ప్రారంభించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంగా పనిచేయాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి త్వరగా విచారణ చేయాలని పేర్కొన్నారు. 'మన జిల్లా-మన నీరు'లో భాగంగా అన్ని శాఖల అధికారులు వారి పరిధిలోని మండల, గ్రామ స్థాయి కార్యాలయాల్లో తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతలు నిర్మించాలని అన్నారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంత నిర్మించే విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

భూభారతి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం రెవెన్యూకు సంబంధించిన వివిధ అంశాలపై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్‌లతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులను పరిష్కరించే క్రమంలో టెక్నికల్ లేదా ఇతర సమస్యలు ఎదురైతే రాష్ట్రస్థాయి నుంచి వెంటనే సహకరించేందుకు టీం సిద్ధంగా ఉందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం

● జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈఓ భోజన్న తదితరులు

దేవరుప్పుల : ప్రభుత్వం సకల సౌకర్యాలతో ఉచితంగా అందించే విద్యను అందిపుచ్చుకునే విషయంలో ప్రజలు స్వచ్ఛంద భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం రావడం అనివార్యమని జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న అన్నారు. సోమవారం మాధాపురం ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం లలిత భర్త బిల్లా రమేశ్ ఐదు కంప్యూటర్లు బహూకరించగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం 90 మందికి పెంచడంలో తోడ్పాటు అందించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన సతీశ్, నరేశ్, యాకూబ్‌తోపాటు హెచ్‌ఎం నల్ల లలిత రమేశ్ దంపతులను డీఈఓ సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ జి.కళావతి, జిల్లా ఏసీజీ రవికుమార్, డీసీఈబీ చైర్మన్ చంద్రభాను, హెచ్‌ఎంలు వెంకన్న, రమేశ్, ఏపీసీ చైర్మన్ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

● కూలీపని చేసి నగదు అందజేసిన విద్యార్థులు



ప్రవళికకు నగదు అందజేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి టౌన్ : మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పండుగ ప్రవళిక ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆదివారం తోటి విద్యార్థులు కూలీ పనులకు వెళ్లగా వచ్చిన రూ.9,500 నగదును సోమవారం ప్రవళికకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

క్రీడాప్రాంగణ స్థలంలో సబ్ స్టేషన్

● గ్రామస్తుల తీర్మానం, కలెక్టర్ ఆదేశాలు



చదును చేయిస్తున్న అధికారులు

రఘునాథపల్లి : మండలంలోని లక్ష్మితండాలో క్రీడా ప్రాంగణం స్థలాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కేటాయించారు. విద్యుత్ అవసరాల నిమిత్తం తండాకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. అనువైన స్థలం అందుబాటులో లేక స్థల సమస్య నెలకొంది. ఇటీవల గ్రామస్తులు సమావేశమై క్రీడా ప్రాంగణం స్థలాన్ని సబ్‌స్టేషన్ కోసం వినియోగించుకోవాలని తీర్మానం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో కలిసి క్రీడా ప్రాంగణం బోర్డు తొలగించి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమి చదును చేయించారు. ఈ స్థలం వెనకాలకు క్రీడా ప్రాంగణాన్ని మార్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కల్యాణ మండప నిర్వహణకు నిధులు

● అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న పింకేష్ కుమార్

పాలకుర్తి టౌన్ : పర్యాటకంగా పాలకుర్తిని అభివృద్ధి చేసేందుకు మండల కేంద్రంలో నిర్మించిన శ్రీ సోమేశ్వర కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీసోమేశ్వర కల్యాణ మండపాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పింకేష్‌కుమార్ మాట్లాడుతూ.. కల్యాణ మండప నిర్వహణ బాధ్యతను మండల సమాఖ్యకు అప్పగించినట్లు తెలిపారు. మరమ్మతులతో పాటు ఇతర పనులకు రూ.47లక్షలు మంజూరు చేశామని తెలిపారు. డీఆర్‌డీఏ ఏపీడీ నూరొద్దిన్, డీపీఏ రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవీందర్, ఏపీఓ పిట్టల నరేందర్ పాల్గొన్నారు.

దారిబంద్ చేసిన వారిపై చర్య తీసుకోవాలి



దారికి అడ్డంగా వేసిన రాళ్లను చూపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని నమిలిగొండ గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రభుత్వ దారిలో అడ్డుగా రాళ్లు, చెట్లు వేసి బంద్ చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు పూంద్రు రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి కోరారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన తమకు నమిలిగొండ శివారులో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే నమిలిగొండకు చెందిన చిన్నపూంద్ర శివారెడ్డి వ్యక్తిగతంగా తమ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లే దారికి అడ్డంగా రాళ్లు, చెట్లను వేయించాడన్నారు. దీంతో తాము వ్యవసాయ భూమి వద్దకు వెళ్లేందుకు దారి లేకుండా అయిందన్నారు. రహదారిని బంద్ చేసిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించాలని, దారి బంద్ చేసిన వ్యక్తిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాకు న్యాయం చేయండి

చిల్పూరు : వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి విషయంలో తమకు న్యాయం చేయాలని అధికారులను అధికారులను కోరుతున్నారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం రాజగొళ్ల-గీత తమ వ్యవసాయ పనులు నిమిత్తం సాదం ఆంజనేయులు ట్రాక్టర్ వెళ్లేంతా దారిని ఏర్పాటు చేశారు. అనంతరం ఆంజనేయులు గ్రామంలోని నాయకుల అండతో దారి లేకుండా చేసి పంట వేసుకున్నాడని తెలిపారు. ఇదే విషయంపై ఆరు నెలల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి దారి ఉందని తేలిందన్నారు. బావి వద్దకు వెళ్లేందుకు దారి లేదని అందుకు బాట వెంట వెళ్లామే తప్ప ఎలాంటి దౌర్జన్యానికి పాల్పడలేదని పూర్తి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

కొత్త చట్టాలతో సత్వర న్యాయం అందడం లేదు

● 'ఐలు' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

జనగామ రూరల్: నూతన చట్టాలతో సామాన్య ప్రజలకు సత్వర న్యాయం అందడం లేదని 'ఐలు' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పార్థసారథి అన్నారు. పట్టణంలో అడ్వకేట్ గాజుల రవీందర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువ న్యాయవాదులకు చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అనంతరం జనగామ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్ గాజుల రవీందర్, కోకన్వీనర్ మహేశ్వరం బద్రీనాథ్, జి.అమృతరావు, వట్టెపు వినయ్‌కుమార్, అడ్వకేట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బిట్ల గణేష్, కమిటీ సభ్యులు బాలబోయిన సంపత్, చాగంటి శ్రీనివాస్, గుగులోతు శ్రీనివాస్ నాయక్, బసుకశాగూర్ ప్రసాద్, దడిగే సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎదునూతల శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మండదపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపు గుర్రాలకే 'స్థానికం'లో అవకాశాలు

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు చెప్పినా వినేది లేదని, గ్రామాల్లో ప్రజాబలం ఉన్న వారికే అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సభకు నియోజవకర్గం నుంచి 500 మందికి తగ్గకుండా పార్టీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'గ్రూపు రాజకీయాలు వద్దు'

పార్టీలో ఎలాంటి గ్రూపు రాజకీయాలు వద్దని, పాత, కొత్త అనే భేదం లేదని, అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేసిన వారికే గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చిట్ల సత్యనారాయణ అన్నారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు

● చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని ఫ్లెక్సీతో నిరసన



ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధులు

స్టేషన్‌ఘన్‌పూర్ : తమకు వారసత్వంగా వచ్చిన భూమిలో ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా అడ్డుకుంటున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని వృద్ధ దంపతులు జింక కొమురయ్య, రాజమ్మ వేడుకుంటున్నారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని నమిలిగొండకు చెందిన కొమురయ్యకు గ్రామంలోని సర్వే నంబర్ 364లో రెండు గుంటల స్థలం ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అదే స్థలంలో చిన్న గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన కొందరు ఎస్సీ వర్గానికి చెందిన పెద్ద మనుషులు తమ ఇంటి నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారని, సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని వాపోయారు. మమ్మల్ని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గుడిసెను ధ్వంసం చేశారని, ఇంటి నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలను పూడ్చి వేశారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యయే శరణ్యమని వాపోతున్నారు.

ఇరు వర్గాలకు నచ్చచెప్పాం: ఎస్సై వినయ్‌కుమార్

ఇదే విషయమై ఎస్సై వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి నచ్చచెప్పాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని, శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించామని పేర్కొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు యూటీఎఫ్ కృషి



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్ : టీఎస్ యూటీఎఫ్ నిర్వహించిన ప్రచార జాతా ఫలితంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లక్షకు పైగా పెరిగిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ తెలిపారు. మండలంలోని తీగారం, హనుమాన్‌తండా, గువ్వలగూడెం, సూరారం, శాపల్లి, తమ్మడపల్లి (జి), ఓబులాపూర్, తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్, వడ్డెగూడెం, మోడల్‌స్కూల్ పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా వంశీకృష్ణ, పాము భానుప్రకాశ్, నాయకులు మెంతుల శ్రీనివాస్, కందుల శ్రీనివాస్, చిదురాల నాగరాజం, సభ్యులు శ్రీనివాస్, పిట్టల మహేందర్‌తో పాల్గొన్నారు.

జనగామలో జోరువాన



జనగామ : జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం జోరు వర్షం కురిసింది. అరగంట పాటు దంచి కొట్టగా.. అనంతరం మోస్తారు చినుకులు పడ్డాయి. దీంతో ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలకు కాసింత చల్లదనం దొరికింది.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ అధ్యక్షతన రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రఘునాథపల్లి : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని ఫతేషాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

కొడకండ్ల : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను, పరిసరాలను, సిబ్బంది క్వార్టర్లను పరిశీలించారు.

నగదు బహుమతి అందజేత

జనగామ రూరల్ : ధర్మకంచ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో దాత రమేశ్ కుమార్ జజ్జాజ్ సోమవారం నగదు బహుమతి అందజేశారు. 2024–25 పదో తరగతి పాఠశాల టాపర్‌కు మొత్తం రూ.26వేల నగదును అందజేశామని అన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

నర్మెట : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రైజింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు సోమవారం ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణు మాట్లాడారు.

చెన్నూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు..

సంక్షిప్త సమాచారం

పాలకుర్తి : మండలంలోని చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు పుస్కూరి సోమేశ్వర్‌రావు, గునిగంటి సురేష్‌రావు, పుస్కూరి రమేష్‌రావు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తరిగొప్పుల : ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఎంపీడీఓ ఆలేటి దేవేందర్ రెడ్డి సూచించారు.ఆయుష్మాన్ ఆరోగ్య శివిర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రగతి

దేవరుప్పుల : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు ప్రగతి సాధించాయని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రావిఎరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం గ్రామ ఇన్‌చార్జ్ కొల్లూరి సోమన్న పర్యవేక్షణలో నిర్వహించారు.

సమాజహితానికి పాటుపడండి: ఎమ్మెల్యే

దేవరుప్పుల : పదవీ విరమణ పొందిన అనంతరం సమాజహితం కోసం పాటుపడాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక గార్డెన్‌లో ఎంపీడీఓ కాసారపు లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, మణెమ్మ దంపతులను ఎమ్మెల్యేతో పాటు తదితర అధికారులు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

అంకితభావంతో పనిచేయాలి

జఫర్‌గఢ్/లింగాలఘణపురం : ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని జఫర్‌గఢ్ ఎంపీడీఓ సుమన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గట్టు శ్రీనివాస్ పదవి విరమణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీనివాస్ దంపతులను శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. అలాగే లింగాలఘణపురం జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జనగామలోని ఉప్పలమ్మ గుడి ఈఓ కొండబోయిన రాములు పదవీ విరమణ సన్మాన సభ జరిగింది.

ముత్తయ్య సేవలు అభినందనీయం



జనగామ : ఆర్టీసీ సంస్థలో ముత్తయ్య అందించిన సేవలు అభినందనీయమని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, డీఎం స్వాతి అన్నారు. జనగామ ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ముస్త్యాల ముత్తయ్య సోమవారం పదవీ విరమణ పొందారు. అనంతరం ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, గౌడ కులస్తులు ముత్తయ్యను గజమాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ పదవీ విరమణ

జనగామ మున్సిపల్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పి.సోమయ్య సోమవారం పదవీ విరమణ పొందారు. పురపాలిక కార్యాలయంలో జరిగిన వేడుకలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్, మేనేజర్ రాములు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, ఉద్యోగులు సోమయ్య దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందించారు.